ఘాట్ రోడ్డులో జరిగిన లారీ ప్రమాదం సంగతి విన్న ఓ నిండు చూలాలు, ఆ ప్రమాదంలో పోయింది తన లారీ డ్రైవరు భర్తేమోనన్న భయంతో విలవిలలాడిపోతుంది. కీడును శంకించే మానసిక ఆందోళనకి ఎవ్వరూ అతీతులు కారుగదా!

# నారీ డైవోరు

"ఒవే! రంగమ్మా! ఆ రాఁవులు కిల్లీ కొట్టు కాడ ఆ గలాటా ఏటే? తెల్లారిన కాణ్ణించి సూత్తన్నాను. అంత మంది గుమిగూడి ఊసులాడతన్నారు. ఏటది?"

స్నానం జేసి, తడికల పక్కన తలారబోసుకుంటున్న సత్తెమ్మ కంప లేరుకుని నెత్తిన బెట్టుకుపోతున్న రంగమ్మని పలకరించి అడిగింది.

"ఆఁ! ఏముంటాది, మామూలే! మల్లీ రాత్రి గాటీ రోడ్డులో మూడో మెలుపుకాడ ఎవురిదో నారీ తిరగబడిపోనాదంట. సామానుతో సయితం డైవోరు కూడా అయిపు నేదంటున్నారు."

నడుత్తానే జవాబు చెప్పి ఎల్లిపోయింది రంగమ్మ.

సత్తెమ్మకి ఆ మాట గుండెల్లో ముల్లులా తగిలి కలుక్కుమన్నది. అమ్మో! రేత్తిరి గాటీ రోడ్డులో నారీ సర్వీసుకి మాఁవే ఎల్లాడు. కొంపదీసి ఆడి నారీయే కాదు గందా! ఎంత జెప్పినా ఇన్నాడు గాడు. ఆ ముదనష్టపు సర్వీసు మనకొద్దు మాఁవా అంటే, "సేత్తే గాటీలో నారీ డైవోరు ఊజ్జోగఁవే చెయ్యాల, కండబలం, గుండె ధైర్యం ఉండి మొగోడిలా బతకాల గాని, మరొకలాటి బతుకు సావుతో సమానం" అన్నాడు.

మాఁవ మనసు తనకి తెలుసు. ఆడు జగమొండి. శతమొండి. పట్టుదలొత్తే ఉడుంపట్టే! అసలు ఆడిలో ఆ గుణం, ఆ చొరవ నూసే గందా అమ్మా నాన్నా వొద్దంటున్నా ఇనకుండా ఆ డెనకాల లేచొచ్చేసింది.

ఏ మాటకామాటే సెప్పుకోవాల - ఒకటి రెండు తూర్లు తనూ మాఁవ నారీ డ్రయివింగు సేత్తా ఉంటే, పక్క సీట్లో కూకుని పెయానం సేసింది. స్టీరింగు కాడ కూకున్న మాఁవ ఆగమేగాల్లో నారీ తోల్తాడు. నారీ నేల మీద గాకుండా, గాల్లో పోతున్నాదా అన్నట్టుంటాది. ఎలాటి డైవోరైనా సరే గాటీ సర్వీసులో మాఁవ కాడ దిగదుడుపే!

"ఏంటి మాఁవా ఈ దుడుకుతనం? ఎప్పుడో కొంపముంచేత్తావు" అంటే - 'ఇస్' అని నవ్వేసేవోడు.

"ఒవే! సత్తెమ్మా! సావు కిన్ని సావు లుండవే! సావుకి బయపడి ఎన్నాల్లు బతగ్గలమే?" అని కల్లు ముంతట్టుకుని ఎల్లిపోయివోడు. ముంతెడు కల్లు దాగి మత్తులో తిరిగొచ్చిన మాఁవ ముద్దెట్టుకుంటే, గళాసుడు సారా దాగినంత కైపెక్కిపోయిది. అందికే, అందికే గందా! అన్నీ వొదిలేసి, అందర్నీ వొగ్గేసి మాఁవెనకాలొచ్చేసి, ఈ లోయలో చిన్న పాకేసుకుని మాఁవతో కాపరం సేత్తాంది. సొరగం అంటే, ఎక్కడో ఉంటాదేటి. ఇక్కడే ఉన్నాది.

"అందులోనూ ఈ మజ్జెన నెల తప్పిన కాణ్ణుంచీ మాఁవ నన్ను నేల మీన కాలాన నియ్యటల్లేదు. మూడో నెల్లో మూకుడు మూసినట్టున్న కడుపుని సూసి మురిసిపోయివోడు మాఁవ. "నా కొడుకుని కంట్రాట్టు బాబు జీపుకి డైవోర్ని సేత్తాను" అని కలలు గనీవోడు. ఆ కంట్రాట్టు బాబు పున్నెమా అని మాఁవకి నారీ మీద రాల్లు తోలీ ఉజ్జోగమొచ్చింది. ఎంత కట్టమైన డూటీ సేసొచ్చినా నెలలు నిండిన కడుపుతో ఆయాసపడతావుంటే, గుమ్మం దాటి నడవనివ్వలేదు మాఁవ. అలాటి పేనం పెట్టే, మాఁవకి ఈ టయాంలో ఏమైనా అయితే!....అయ్య బాబోయ్! ఇంకేమైనా ఉందా!

"ఆ నారీ మాఁవది గాకుండా ఉంటే బాగుండును. లేసి ఎల్లి సూసొద్దారంటే వల్లగాని పరిస్థితి. కడుపులో కుర్రోడు కదుల్తా ఉన్నాడు. అమ్మో! నొప్పు లొచ్చేలాగున్నాయి. ఏం జెయ్యాల? ఎవురితో సెప్పుకోను. బగవంతుడా! నువ్వే మాకు దిక్కు. నా మాఁవ కే ఆపదా రాకుండా కాపాడు తండ్రీ!

"తల్లీ! కొండమ్మ తల్లీ! నూకాలమ్మ తల్లీ! మరిడమ్మ తల్లీ! ఎల్లారీశ్వరమ్మ తల్లీ! దురగమ్మ తల్లీ! కనకమాలచ్చిమీ! సత్తెమ్మ తల్లీ! మీ నూటొక్క మంది అప్పజెల్లెళ్లకీ ఒక్కడే తమ్ముడంటారే! ఆ తమ్ముడే పోతరాజు గందా! ఆ పోతరాజు పేరే నా మాఁవ పేరు. అణ్ణీ మీ తమ్ముణ్ణీ, మీరే రచ్చించుకోండి తల్లీ! ఈ ఆపద నుంచి కాపాడండి తల్లీ! పుట్టబోయే పిల్లాడికి మీ పేరెట్టుకుంటాను. ఈ గాటీ సర్వీసు మానిపించేత్తా. మాఁవా. నేనూ, మా కొడుకూ మల్లీ పొలాల్లో కూలిపని కెల్లిపోతాం. ఈ వొక్క తప్పుకాయి బగవంతుడా!" అని అందరు దేవతలకి మొక్కుకుంది.

బుర్రలో మాఁవ గురించి భయం ఎక్కువైన కొద్దీ శ్వాస ఎగదన్ని ఆయాసం ఎక్కువైంది సత్తెమ్మకి. కూకున్నకాడి నుంచి లేవడమే గగనమైంది. నొప్పి భరించలేక బాధతో గట్టిగా ఓ కేక వేసి ఆగిపోయింది సత్తెమ్మ. నేల మీద పడిన పసికందు 'కేరు' మన్నాడు. అది విని సరుగెత్తుకొచ్చిన ఇరుగమ్మా పొరుగమ్మా సత్తెమ్మని 'ఇదేం పోయీకాలమే నీకు? నొప్పి లొత్తే సెప్పుకోరా? మేం పరాయోల్లమా?' అని తిట్టి. చిరిగిన చీర చాటున కావలసినవన్నీ చేసి వెళ్లారు.

స్నానం చేయించిన బాబుని పక్కలో పడుకోబెట్టుకున్న సత్తెమ్మకి, గుడిసె గుమ్మం కాడ పోతరాజు మాఁవ దరిసెనమిచ్చేడు. సత్తెమ్మ మొకం, ఇరగబూసిన తురాయి చెట్టల్లే మెరిసిపోయింది.

"నువ్వేనా మాఁవా? బాగానే ఉన్నావా?" అని నీరసంగా లేచి కావిలించుకుంది.

"నా కేటైందే? ఎందుకంత బయపడిపోతన్నావు? ఉండు. ముందు నా కొడుకుని ముద్దెట్టుకోని!" అని తాటాకు చాప మీద చతికిలబడ్డాడు మాఁవ, ఆత్రంగా పసిగుడ్డుని సూత్తా.

"నారీ తిరగబడిపోనాదంట! నీదేనా? నా కెంత బయమేసిందో! ఎందుకు మాఁవా మనకీ ఉజ్జోగం! ఎల్లిపోదాం పద!" అని మాఁవ మీద పడి గొల్లున ఏడిచింది సత్తెమ్మ.

పండు లాంటి కొడుకునిచ్చిన సత్తెమ్మని చేరదీసి ముద్దెట్టుకుని, "యాడి కెళ్లిపోతావే ఎర్రిమొకమా! సావుని తప్పించుకుని పారిపోయి గెలిచిన మడిసి ఎక్కడైనా ఉన్నాడా? పొద్దుటే లేసి సత్తెమ్మ తల్లి మొగం సూసి దణ్ణమెట్టుకు డూటీలో దిగితే నాకు తిరుగునేదంతే! పిచ్చి పిచ్చి ఏసాలెయ్యక నువ్వూరుకో!" అని సత్తెమ్మని కసిరాడు పోతరాజు.

"ఈ డికెప్పుడు బుద్దొచ్చేనో! ఎంత సెప్పినా ఇనిపించుకోడు. ఏఁవన్నా అంటే, ఇదుగో ఇలా తిరగబడతాడు. బగవంతు డెలా రాసిపెట్టేడో అలాగే జరగాల. ఏమైతేనేం మాఁవ నా దేవుడు. నారీ డైవోరు!" అని సరిపెట్టుకుంది సత్తెమ్మ.

*